

హమాలీలనూ.. దోచేస్తారా..!

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రభుత్వ కార్యక్రమాలు, భూములు, గనులు, ఇసుక, కాంట్రాక్టుల విషయంలో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవడం చూస్తుంటాం. కానీ జిల్లా కేంద్రమైన చిత్తూరు ఎస్‌పీడీసీఎల్ స్టోర్సులో హమాలీల నియామకంలోనూ ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకోవడం విడ్డూరంగా ఉంది.

చిత్తూరు ఎస్పీడీసీఎల్ స్టోర్స్‌లో హమాలీలు వర్కర్స్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. గత పది సంవత్సరాలు నామినేషన్ పద్ధతిలో హమాలీలకు కాంట్రాక్టు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడాకా కొత్త పద్ధతిని తీసుకొచ్చారు. థార్డ్ పార్టీకి టెండర్లు వేస్తూ ప్రోత్సహిస్తున్నారు. తక్కువ కొటేషన్ వేసే వారికి ఇచ్చేలా అధికారులపై రాజకీయ పలుకుడితో ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ పద్ధతి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు. చిత్తూరులో మరీ పట్టుబట్టి ఎంఎల్ఏ అనుచరులకు ఎస్పీడీసీఎల్ హమాలీ టెండర్‌ను కట్టబెట్టేందుకు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇదే జరిగితే గత 40 సంవత్సరాలు ఎస్పీడీసీఎల్ స్టోర్స్ హమాలీలుగా పనిచేస్తున్న వారు ఉపాధి కొల్పోతారు. ఇప్పటికే తమ ఉపాధిని దెబ్బతీయందంటూ పలు దఫాలుగా హమాలీలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేయడంతో పాటు హమాలీల కుటుంబసభ్యులు శాసనసభ్యుడి ఇంటివద్దకు వెళ్లి వేడుకున్నారు. అయినా ఎమ్మెల్యే మీరు కూడా టెండర్లు వేయండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో హమాలీలు పోరాటానికి సిద్ధం అవుతున్నారు.

సొసైటీని ఏర్పాటు చేసుకొని తక్కువ కూలీలకు పనిచేస్తున్నా విద్యుత్ హమాలీల పొట్టగొట్టేలా అధికార పార్టీ ప్రజాప్రతినిధి టెండర్ విధానాన్ని ప్రోత్సహించడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు హమాలీల విషయంలోనూ రాజకీయ జోక్యం చేసుకుంటూ పూట కూలీలైన హమాలీల పొట్టగొట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



టెండర్ విధానాన్ని రద్దు చేయాలంటూ విద్యుత్ జిల్లా స్టోర్ ఎదుట నిరన వ్యక్తం చేస్తున్న హమాలీలు (ఫైల్ ఫొటో)

హమాలీల పొట్టగొట్టొద్దు..
- ఆరోగ్యదాస్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు

సొసైటీని ఏర్పాటు చేసుకొని విద్యుత్ సోర్సులో హమాలీలుగా 40 సంవత్సరాలకు పైగా పని చేస్తున్నాం. సొసైటీ ఏర్పాటు చేసుకున్న వారికే టెండర్ ఇస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హమాలీల టెండర్ల విషయంలోనూ కొత్తగా టెండర్ పద్ధతి తీసుకొచ్చింది. టెండర్ తక్కువ కోడ్ చేసిన వారికి ఇస్తామంటున్నారు. ఇది చాలా దుర్మర్గం. ఇదే జరిగితే విద్యుత్ స్టోర్సును నమ్మకొని పనిచేస్తున్న హమాలీల కుటుంబాలు వీధినపడతాయి. టెండర్ల విధానం రద్దు చేసి సొసైటీలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇవ్వాలని కోరుతున్నాం. ఈనెల 23న తిరుపతిలోని సిఎండి కార్యాలయం వద్ద ఎనిమిది జిల్లాకు చెందిన విద్యుత్ స్టోర్స్ హమాలీలు నిరవధిక దీక్షలకు పూనుకుంటున్నాం.

టెండర్ల ప్రక్రియ వెంటనే రద్దు చేయాలి
- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

విద్యుత్ స్టోర్సు హమాలీల విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసేలా వ్యవహరిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా టెండర్ల విధానం తీసుకొచ్చింది. ఇది చాలా దుర్మర్గం గతంలో సొసైటీలు ఏర్పాటు చేసుకున్న వారికే పని ఇచ్చేవారు. కొత్త పద్ధతిలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులను ఒత్తిడి తీసుకొస్తూ తమ వారికే టెండర్లు వచ్చేలా నేటి వరకు పనిచేస్తున్న హమాలీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. పీస్ రేటు రద్దు చేసి జీతం ఇవ్వడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి.

ఘనంగా విశ్వకర్మ మహోత్సవాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, జెసి ఎమ్మెల్యే

విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించిన దేశ శిల్పిగా ప్రసిద్ధి చెందారని స్థానిక ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, చిత్తూరు నగర మేయర్ అముద, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఛైర్మన్ పార్వతమ్మ, బీసీ కార్పొరేషన్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు, వాస్తుశాస్త్ర పితామహుడుగా గౌరవింపబడే విశ్వకర్మ మహర్షి స్ఫూర్తి మనందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శిల్పకళ, వృత్తి పరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణనిస్తుందన్నారు. నేడు సమాజంలోని వృత్తి నిపుణులు, శిల్పులు, కార్మికులు అందరికీ గౌరవప్రదమైన స్థానం కలిగించే విశిష్ట దినంగా అభిలాశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వారికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారు. బిసి సంక్షేమ, బిసి కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి, ఏ పథకాల అమలు చేస్తున్నారు, ఏమేమి అర్హతలు ఉన్నాయో, కలెక్టర్ అనుమతి తీసుకొని వివిధ బిసి పాఠశాలలో, వసతి గృహాలలో, బీసీ కార్యాలయాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో మంచి ప్రతిభను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ ఆచారి, ఉమ్మడి విశ్వ బ్రాహ్మణ చిత్తూరు రాష్ట్ర డైరెక్టర్ దశరథ ఆచారి, నాయి బ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దయానందాచారి, జిల్లా కోశాధికారి హేమచంద్ర చారి, జిల్లా అధ్యక్షులు తిరుమలాచారి, నాగరత్నం రెడ్డి, కుమరేశాచారి, శివకుమార్, డైరెక్టర్ ఎస్సీ ఫైనాన్స్ యుగంధర్ పాల్గొన్నారు.

గాజదాడుల నివారణకు సోలార్ కంచె..

రూ.36 లక్షలతో పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రామకుప్పం

మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన ఎస్.గొల్లపల్లి వద్ద ఏనుగు దాడుల నిరోధానికి సోలార్ కంచె ఏర్పాటుకు రూ.36 లక్షలు విడుదలయ్యాయని బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. ఎస్ గొల్లపల్లిలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కావలిమడుగు నుంచి ఎస్ గొల్లపల్లి, పిఎంకె తాండ పరిసరాల్లో, నాలుగు కిలోమీటర్ల మేర మొదటగా కంచె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ఆరు నెలల నుంచి ఒంటరి ఏనుగు, అప్పుడప్పుడు గుంపు ఏనుగులు అడవిని దాటి, గ్రామాల సమీపంలో రైతులు పండిస్తున్న పంటలపై పడి అపార నష్టం కలిగించాయి. దీంతో సమస్యను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అటవీ సమీప ప్రాంతాలైన గ్రామాల వద్ద సోలార్ కంచె అమర్చి, ఏనుగు దాడుల నివారణకు చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ హరికుమార్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, రాష్ట్ర వన్యకుల క్షత్రియ డైరెక్టర్ భూపతి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ నాయక్, సింగల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు గౌడు, మురళి, సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : మెగా డీఎస్సీ 2025లో ఎంపికైన అభ్యర్థులందరూ 18వ తేదీన గురువారం ఉదయం 7 గంటలకు చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, రేణిగుంట రోడ్డు, తిరుపతి వద్ద తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా, విజయవాడ సమావేశానికి ప్రయాణ సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు కేటాయించబడినట్లు తెలిపారు.

చెరువును తలపిస్తున్న రోడ్లు





చెరువును తలపిస్తున్న కీలపట్ల గ్రామానికి వెళ్లే దారి, నీరు నిలిచిన సర్వీస్ రోడ్డు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): చెన్నై- బెంగళూరు రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో పక్కనే సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే నాగమంగళం దగ్గర నుండి గంగవరం వరకు సర్వీస్ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలకు నీరు చేరి రోడ్డా.. చెరువా.. అన్నట్లు కనిపిస్తున్నాయి. రోడ్డుపై నిలిచిన నీరు బయటకు వెళ్లడానికి దారి లేకుండా రోడ్డును వేయడంతో రోడ్డుపైనే వర్షపు నీరు నిల్వ చేరి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోంది. కొద్దిపాటి వానలకు కూడా నీరు చేరిపోతోంది. దీనికి తోడు మురుగునీరుకూడా చేరడంతో వాహనదారుల అవస్థలు వర్ణాతీతం. అంతేకాకుండా రోడ్లపై అక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా వేయడంతోనూ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరం లేని చోట్ల కూడా స్పీడ్ బ్రేకర్లు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ చేరడంతో గుంతలుపడి నీరు చేరిపోతున్నాయి. పలుమార్లు వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇకైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

వీధి శునకాలకు స్టెరిలైజేషన్


వీధి కుక్కల స్టెరిలైజేషన్ పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం నగరంలోని వీధి శునకాలకు స్టెరిలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ వాహనాల షెడ్డులో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. వీధిశునకాల శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచాలన్నారు. నెలకు 250 వీధి శునకాలకు శస్త్ర చికిత్సలు నిర్వహించి, రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. చికిత్సల అనంతరం వీధి శునకాలు విశ్రాంతి తీసుకునే బ్యారెక్‌ల సంఖ్యను 30కి పెంచడం జరిగిందని.. శస్త్రచికిత్సల సంఖ్యను పెంచాలన్నారు. యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అన్ని వార్డుల పరిధిలో వీధి శునకాలను పట్టడం, శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ చేయడం, మళ్లీ వాటిని యథాస్థానంలో వదిలేయడంపై సంబంధిత బృందాలు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్ (పాత బస్టాండ్) అభివృద్ధిపై ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, కన్సల్టెంట్ ప్రతినిధులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత బస్టాండును పీపీపీ మోడ్‌లో ఇంటిగ్రేట్ బస్టాండ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల్లో పాత బస్టాండ్ అభివృద్ధి ఒకటిగా ఉందన్నారు. ఇంటిగ్రేట్ బస్టాండ్ అభివృద్ధి, నిర్మాణం, పీపీపీ మోడల్ విధానంపై మున్సిపల్ అధికారులు, కన్సల్టెంట్ ప్రతినిధులతో సమగ్రంగా చర్చించారు. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.


పాత బస్టాండ్ అభివృద్ధిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

25 నుంచి రెండో విడత సర్వే ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గిరిజన వాస స్థలాల గృహ సర్వే రెండో విడత ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గిరిజనుల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఆర్డీవోలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని, సంబంధిత అధికారులు సంక్షేమ ఫలాలు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించాలన్నారు. గిరిజన వాసస్థలాల్లో గృహ సర్వే మొదటి విడత జిల్లాలోని చిత్తూరు, గంగవరం, కార్వేటినగరం, నింద్ర, పెద్దపంజాణి, పెనుమూరు, శాంతిపురం, సోమల, విజయపురం, యాదమరి మొదటి విడత, 10 మండలాల్లో గల గిరిజనులు కొన్ని సమస్యలు నివేదిక రూపంలో బృందాలు అందజేశారు వాటి వివరాలు ఆధార్‌కార్డు కొరకు 64 దరఖాస్తులు రాగా 49 ఆధార్ కార్డులు ప్రాసెసింగ్‌లో, 12 ఆధార్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మానువల్‌గా 55 ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులకు దరఖాస్తులు రాగా అందులో 53 దరఖాస్తులు డిఎల్‌డివో ఆఫీస్ పంపినట్లు తెలిపారు. అలాగే నూతన విద్యుత్ కనెక్షన్లకు 44 దరఖాస్తులు రాగా 41 అప్లికేషన్లు ప్రాసెసింగ్‌లో 3 కనెక్షన్లు మంజూరైనట్లు తెలిపారు. వికలాంగుల పెన్షన్ కొరకు 6 దరఖాస్తులు రాగా అర్హత కలిగిన మందికి దరఖాస్తులు ధ్రువీకరించడం జరిగింది. వయోవృద్ధుల పెన్షన్ కొరకు మొత్తం 17 దరఖాస్తులు రాగా అర్హత కలిగిన 15 మందికి దరఖాస్తులు ధ్రువీకరించడం జరిగిందన్నారు. ఈనెల రెండో విడత సర్వే కార్యక్రమం 25 తేదీ నుంచి మిగిలిన మండలాలలో గిరిజనుల అత్యధిక ఉన్నచోట సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి సమస్య, పిల్లలు ఆధార్ కార్డు సమస్య, గృహ సమస్య, అసైన్మెంట్ భూమి పంపిణీ, వైద్య సమస్య, రోడ్ల సమస్య, మొదలైన సమస్యలు గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ నిధుల నుంచి, నరేగా నిధుల నుంచి, గిరిజన కాలనీల అభివృద్ధికి వేదికలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ, డిపిఒ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి, గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా వైద్యశాఖ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో, ఐసిడిఎస్ పీడీ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేత


రైతులకు నష్టపరిహారం అందిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గాన్ని ఒక మోడల్ పారిశ్రామిక నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలో భాగంగా, ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం భూములను సేకరించే ప్రక్రియను వేగవంతం చేసిందని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం అన్నారు. బుధవారం గుడిపల్లి మండలం పొగరుపల్లిలో పరిశ్రమల కోసం తమ భూములను ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెక్కులను అందించారు. ఈకార్యక్రమంలో 49 మంది రైతులకు మొత్తం రూ. 10,84,48,759లు నష్ట పరిహారం ప్రభుత్వం తరపున అందజేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ భూములు ఇచ్చినందుకు రైతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పరిహారం వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన వల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వ్యాపారాల అభివృద్ధి జరిగి ప్రాంతం సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గం పరిశ్రమల కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు, ఆర్‌డివో పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు



ప్రజాశక్తి - రొంపిచర్ల

పులిచెర్ల మండలంలో జరుగుతున్న వరుస ఏనుగుల దాడులలో భాగంగా బుధవారం మండలంలోని కల్లూరు పంచాయతీ, పాళ్యం పంచాయతీ, పాతపేట పంచాయతీలోని పంటలపై ఏనుగుల దాడి చేసి రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. బుధవారం తెల్లవారుజామున కల్లూరు గ్రామ సమీపానికి వచ్చిన ఏనుగుల గుంపు మామిడి చెట్లను విరిచి ధ్వంసం చేశాయి. పక్కనే ఉన్న వరి పంటను తొక్కి విధ్వంసం సృష్టించాయి. పశుగ్రాసం పంటని ఇష్టానుసారం పశుగ్రాసం తిని తొక్కుకుంటూ అడవుల్లోకి వెళ్లిపోయాయి. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాలను సందర్శించి రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేస్తామని చెప్పారు.

మోడీ రాజకీయ రిటైర్మెంట్ తీసుకో..!

కేంద్ర వైఫల్యంతోనే యూరియా కొరత
టిడిపి రాజకీయ ప్రయోజనాల కోసమే
మాల మాదిగల మధ్య చిచ్చు
కేంద్ర మాజీమంత్రి డాక్టర్ చింతామోహన్

ప్రజాశక్తి-కుప్పం: 75 ఏళ్ల పూర్తి చేసుకున్న ప్రధాని మోడీ రాజకీయ రిటైర్మెంట్ తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కుప్పంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మీడియా సమావేశం నిర్వహించారు. బిజెపి సీనియర్ నేతలు అద్వానీ, మురళి మనోహర్ జోషి 75 ఏళ్ల పూర్తయిన తర్వాత రాజకీయ రిటైర్మెంట్ ఇచ్చారని అదే బాటలో ప్రధాని మోడీ పయనించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే యూరియా కొరత తలిచిందని ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేదన్నారు. సబ్సిడీపై రైతులకు ఎరువులు ఇవ్వడం ఇందిరా గాంధీ ప్రారంభించారని అలాంటి బృహత్కర కార్యక్రమాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనసాగించడం లేదంటూ మండిపడ్డారు. దళితుల విభజన వల్లే సమైక్యాంధ్ర ముక్కలైందని, టిడిపి రాజకీయ ప్రయోజనాల కొరకు మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టి రెండుగా విడదీసిందంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అంతకంటే పెద్ద పదవిని తీసుకుని మాదిగలకు మూడేళ్ల పాటు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం అంటే మాల మాదిగలను విభజించడం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు చదివిన ఎస్వీ యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని, కనీసం విద్యార్థులు లీవ్ లెటర్ ఇంగ్లీషులో రాయలేకపోతున్నారంటూ వాపోయారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తిందామంటే మంచి ఇడ్లీ కొట్టు కూడా లేదని 15 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన సొంత నియోజకవర్గంలో మంచి హోటల్స్ కూడా కట్టించలేకపోయాడంటూ ఎద్దేవా చేశారు. ప్రగతి సాధించామని గొప్పలు చెప్పే చంద్రబాబు తన నియోజకవర్గంలో సాధించిన ప్రగతి ఎంతో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షమీవుల్లా వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు




సమావేశంలో మాట్లాడుతున్న చింతామోహన్

గంటలో ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- వెదురుకుప్పం


మాంబేడు సచివాలయంలో కంప్యూటర్‌ను అమర్చుతున్న దృశ్యం

వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీలోని సచివాలయంలో కంప్యూటర్ పనిచేయడం లేదంటూ గత నెలరోజులుగా ఆన్‌లైన్ సేవలను నిలిపివేశారు. దీంతో రోజూ సచివాలయంకు పలు రకాల సర్టిఫికెట్స్ కోసం వస్తున్న ప్రజలు వేచి చూసి వెనుదిరుగుతున్నారు. సకాలంలో సర్టిఫికెట్స్ అందకపోవడంతో విద్యార్థులు స్కాలర్‌షిప్ నష్టపోతున్నారు. దీనిపై స్థానిక ఎంపీడీవోకి తెలియజేసినా ఫలితం మాత్రం శూన్యం. ప్రజాశక్తి జిల్లా గ్రూప్‌లో బుధవారం ఈ వార్తను పెట్టడగా వెబ్‌లో వచ్చింది. వెంటనే స్పందించిన ఎంపిడివో మరో సచివాలయం నుంచి కంప్యూటర్‌ను తెప్పించి ప్రజలకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు ఇన్‌ఛార్జి డీడీవో వరలక్ష్మీ తెలిపారు. నెలపాటు ఉన్న సమస్యను ప్రజాశక్తి గ్రూప్‌లో వార్త పెట్టిన గంట సమయంలో స్పందన రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను పరిష్కరించిన ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి అడిషనల్ పిడి మల్లికార్జున్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఉపాధి అడిషనల్ పీడీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఉన్న 13853 వేతనదారులకు ఈ కేవైసీ ఈనెల 25 లోపు చెయ్యాలని, కూలీలకు ఉపాధి హామీపై అవగాహన కల్పించి వారికి పని కల్పించాలన్నారు. అలాగే క్యాటిల్ షేడ్స్ ఆర్థిక సంవత్సరం 2024-25, 2025-26లో మంజూరైన వాటిని మార్కింగ్ చేపట్టి పనులు పూర్తయ్యే విధంగా చూడాలని వాటికి సంబంధించిన నగదు చెల్లించాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలో జరపాలన్నారు. మెటీరియల్ పేమెంట్స్, మొక్కల నాటే కార్యక్రమం గురించి ఉపాధి సిబ్బందితో సమీక్షించడం జరిగిందని తెలపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దినకర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి- యాదమరి: మండలంలో నూతనంగా యుటిఎఫ్ మండల కార్యాలయాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ కార్యాలయాన్ని ఉపాధ్యాయుల సమావేశాలు, కార్యక్రమాల నిమిత్తం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలియజేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మణి గండన్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ బాషా, జిల్లా సహాధ్యక్షులు రెహనా బేగం, జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, మండల అధ్యక్షులు పార్థసారధి, ప్రధాన కార్యదర్శి సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఏడీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామంలో సుభాష్ పాలేకర్ పద్ధతిలో పృథ్వీ మిత్ర రైతు సేవా సంఘం సభ్యులు గోపాల్ నాయుడు 60 కి 60 ఎస్ పీ కే పద్ధతిలో వేసిన మిశ్రమ పంటలను నగిరి ఏడీ కవిత బుధవారం పరిశీలించారు. తక్కువ స్థలంలో బెండ, వంగ, గోరు చిక్కుడు మునగ, అరటి పసుపు అల్లం ఆకుకూరలు పండించడాని పరిశీలించిన ఏడీ పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెండలో ఎరుపు , ఆకుపచ్చ , తెల్లబెండలను పరిశీలించారు. వీటిలో ఆకు ముడతలను గమనించి వాటి నివారణకు ప్రకృతిలో తయారుచేసే కషాయాలను గురించి తెలియజేశారు. నిత్యం పంటలను పరిశీలించాలని చీడపీడలకు సకాలంలో కషాయాలు జీవామృతం లాంటిది స్ప్రే చేయాలని తెలిపారు. పక్కనే ఉన్న కాలాబట్టి దేశీయవలి రకం నల్ల బియ్యం వరి పంటను పరిశీలించారు. ఎస్ఆర్ పురం వ్యవసాయాధికారి కుసుమ, రైతు సేవా కేంద్రం విలేజ్ వ్యవసాయ అధికారి సుకన్య, ప్రకృతి వ్యవసాయ రైతులు గోపాల్ నాయుడు, బాలకృష్ణ నాయుడు మహేష్ ప్రేమ్ చందు, దేవరాజులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- యాదమరి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం వంటిదని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఐరాల మండలం, వినాయకపురం గ్రామానికి చెందిన లబ్ధిదారుడు చంద్రగిరి తేజాకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.81,797 చెక్కును అందజేశారు. ఐరాల మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ గిరిధర్ బాబు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 'స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్'



పెద్దపంజాణిలో..

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండలంలో స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణు ప్రియ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణను మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలవంతం చేయడం అనే ధృక్పథం లక్ష్యంతో 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' ను రూపొందించారని తెలిపారు. ఈనెల 17 నుంచి ఆరోగ్య శిబిరాల్లో పొందిన సేవల వివరాలను ఆన్‌లైన్లో సమయానుసారంగా నమోదు చేయాలని సిబ్బందిని సూచించారు. వనజ మెడికల్ ఆఫీసర్, భాగ్యలక్ష్మి సిహెచ్ఓ, చంద్రమోహన్ సూపర్వైజర్, రాణి జగన్నాథపురం సర్పంచ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారి స్వస్తిక్ పరివార్ అభియాన్ ప్రత్యేక కార్యక్రమం ప్రవేశపెట్టిందని స్థానిక వైద్యాధికారి టి.మురళి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దారికుంట గ్రామంలో స్వస్థ నారి స్వస్తిక్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పలు వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తూ రక్త పరీక్షలు షుగర్, బిపి, డెంగీ, మలేరియా టెస్టులు, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సిహెచ్ఓ అమృత, మండల ఆరోగ్య వైద్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ పంకజ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

తవణంపల్లి: పై మమం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ ప్రియాంక, కమ్యూనిటీ హెల్త్ అధికారి జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి మహిళలకు, గ్రామస్తులకు బిపి, షుగర్, కేన్సర్‌తోపాటు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు.

స్వస్థనారి కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ అనిల్ కుమార్ నాయక్

యాదమరి: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దాసరపల్లి సచివాలయంలో స్వస్థ నారి-సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ప్రారంభించారు. నేటి నుంచి 15 రోజులు పాటు మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. **వెదురుకుప్పం:** మండలంలోని మాంబేడు గ్రామంలో డాక్టర్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో 126 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. స్త్రీలకు టీకాలు, గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. సిహెచ్ఓ మధుసూదన్, హెల్త్ సూపర్వైజర్ ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు నాని, గజేంద్ర, సాగరి, పద్మ, హరిత, తనుజా పాల్గొన్నారు.

పలమనేరు రూరల్ (గంగవరం): మండలంలోని పత్తికొండ ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సార్థజ్ ఆధ్వర్యంలో స్వస్థ నారి ససక్ పరివార కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్‌సిడి 4.0 అవగాహన కార్యక్రమం, కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు, రెగ్యులర్ ఇమ్యునైజేషన్, పిఎంఎంవై పై అవగాహన కల్పించారు. సిహెచ్ఓ రవిచంద్రన్, డిహెచ్ఈవో సావిత్రమ్మ, ఎంపీపీ జయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు అపర్ణ, చాముండేశ్వరి, సమీర, తేజశ్విని, శకుంతల, ఏఎన్ రెడ్డమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో వనజ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం కటికపల్లి ఆరోగ్య కేంద్రంలో ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బాలాజీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కటికపల్లి గ్రామపంచాయతీ పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ వాటర్ షెడ్ చైర్మన్ గుణశేఖర్ నాయుడు ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ బి.వేణుగోపాల్, సబ్ యూనిట్ ఆఫీసర్, మోహన్ బాబు ల్యాబ్ టెక్నీషియన్ షణ్ముగం ఎంఎల్‌హెచ్‌పి ఈశ్వరి, యమునా వాణి ధరణి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని డీఎం పురం ఆయుష్మాన్ ఆరోగ్య భవనంలో ప్రారంభించిన స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించారు. హైపర్ టెన్షన్ డయాబెటిస్, హెచ్ఐ స్క్రీనింగ్, నిశ్చయ ఐడీ, ఎన్సీ పరీక్షలు, టీబీ స్క్రీనింగ్, సికిల్ సెల్ అనీమియా పరీక్షలతో పాటు, కేన్సర్ స్క్రీనింగ్ బ్రెస్ట్, సర్వైకల్ ఒరల్ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఆయుర్వేద వైద్యులు ఎస్.ప్రియాంక, సిహెచ్ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరీ, వర్ధనేశ్వరులు త్యాగా, ఐసీడీఎస్ సూపర్వైజర్ రోజారమణి పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో అనిగానూరు గ్రామంలో బుధవారం ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన శిబిరంలో 70 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ గ్రామాల్లో గర్భవతులు తీసుకోవాల్సిన ఆహారాలపై సూచనలు, సలహాలు అందించారు. హెల్త్ అసిస్టెంట్ బాలు, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, జయశంకర్, మహేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, మల్లేష్, షణ్ముగం, బీరప్ప, శు భాష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని హేమచంద్ర నాయుడు అన్నారు. బుధవారం ఆసుపత్రి వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో స్వస్థ నారి-సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉప సర్పంచ్ లోకనాథం నాయుడు, వైద్యులు స్వరూప, విజయ్ కుమారి, శాలిని, రాగ భవాని, జస్వంత్ రాయల్, రమేష్, చంద్రమోహన్, స్వాతి, సూరి నాయుడు, జనార్దన్ గౌడ్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

సోమల: సమాజంలోని స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం సమాజం దేశ భవిష్యత్తు ఆరోగ్యంగా ఉంటుందని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బాలాజీ అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నెమ్మ గారి పల్లి సచివాలయం వద్ద స్వస్తనారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని స్త్రీలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు మాత్రలను పంపిణీ చేశారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జయసింహా, సిహెచ్ఓ అమర్నాథ్, ఆసుపత్రి సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.



రొంపిచెర్లలో..

క్రైం న్యూస్

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి- కుప్పం: కుప్పంలో బుధవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. డెలివరీ కోసం పుట్టింటికి వచ్చిన భార్య కాపురానికి రాకపోగా తనతో సరిగ్గా మాట్లాడటం లేదని కోపంతో భర్త అతికిరాతకంగా భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన కుప్పం మండలం బైరప్ప కొట్టాలు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కీర్తి (18)కి రెండేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా కట్టాయపేడు గ్రామానికి చెందిన రాజేష్‌తో వివాహం జరిగింది. డెలివరీ కోసం ఐదు నెలల క్రితం కీర్తి పుట్టింటికి వచ్చింది. కీర్తికి నాలుగు నెలల కొడుకు ఉండగా డెలివరీ అయ్యి నాలుగు నెలలు కావస్తున్న కాపురానికి రాకపోగా తనతో సరిగ్గా మాట్లాడటం లేదన్న కోపంతో రాజేష్ భార్యతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో తెలియదు కానీ అతికిరాతకంగా కీర్తి గొంతు ముఖంపై నరకడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కీర్తిని చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం పిఈఎస్ ఆస్పత్రికి తరలించారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ఏరియా ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈనెల 11వ తేదీన రైల్వేస్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గుర్తించిన రైల్వే పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే వారం రోజులుగా కుప్పం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. గుర్తుతెలియని వ్యక్తి ఆసుపత్రికి వచ్చినప్పుడే తీవ్ర అనారోగ్యంతో అపస్మారక స్థితిలో ఉన్నాడని అతనికి వారం రోజులుగా వైద్యం చేయగా బుధవారం మృతిచెందినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు విజయకుమారి తెలిపారు. ఈనెల 11వ తేదీన రైలు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడిని చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారని, వారం రోజులుగా అతనికి చికిత్స చేస్తుండగా అతని తాలూకు ఎవరూ రాలేదని ఇవాళ ఉదయం అతను మృతి చెందినట్లు గుర్తించి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని దళవాయిపల్లె దళితవాడకు వెళ్ళే రోడ్డులో వర్షపు నీరు నిల్వ చేరి ప్రజల అవస్థలను గుర్తించిన టిడిపి నేత ధనంజయ నాయుడు సొంత డబ్బు ఖర్చుపెట్టి సమస్యను పరిష్కరించారు. బుధవారం మండలంలోని వరత్తూరు పంచాయతీ దళవాయిపల్లె గ్రామం దళిత వాడ రోడ్డుపై వర్షం నీళ్లు నిలిచిపోయి ప్రజలకు సమస్యగా ఉందని, ఈ విషయాన్ని కొందరు దళతవాడ ప్రజలు జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడుకు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే థామస్‌కు తెలియజేసి ఆయన ఆదేశాల మేరకు జేసీబీతో రోడ్డుకి ఇరువైపులా కాలువలో నిలిచిన నీళ్లను, మట్టిని తొలగించి రోడ్డుపై నీరు నిలువకుండా చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు పక్కన కాలువలు కట్టిస్తామని, పెండింగ్ ఉన్న చోట సిమెంట్ రోడ్డును వేస్తామని హామీ ఇచ్చారు.

ఉదయం పోర్టల్‌పై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం జిల్లా ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో ఉదయం రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి



తెలిపారు. ఈకార్యక్రమంలో 255 ఉదయం రిజిస్ట్రేషన్ ఉపయోగాలు, వాటివలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన వారందరూ ఉదయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని దానివలన కలుగు ప్రయోజనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సూరిబాబు, ఐపిఓ రామాంజనేయులు రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు హర్షనీయం

మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ 2025 ఫలితాల ఎంపికలో ఆప్షన్‌కు కాకుండా మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమ చంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో అన్ని డిఎస్సిలలో ఫలితాలను ప్రకటించడం, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో ఏ పోస్టును ఎంపిక చేసుకుంటారని అడిగేవారన్నారని, అందుకు భిన్నంగా ఈ డిఎస్సి దరఖాస్తు చేసేటప్పుడే ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని, ఆ మేరకే పోస్ట్ కేటాయిస్తామని చెప్పడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఉపాధ్యాయ ప్రమోషన్స్‌లో కూడా రెండు సబ్జెక్టులకు అర్హత కలిగి ఉంటే దరఖాస్తు పరిశీలనప్పుడు వారిని ఆప్షన్ అడుగుతారని అటువంటిది డీఎస్సి నియామకాల్లో నిరాకరించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించి మెరిట్ ప్రాతిపదికన ఉన్నత పోస్టుకు ఎంపికైన వారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రౌండ్ పాయింట్స్

లెక్కింపు వేగవంతం చేయండి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని సచివాలయ సర్వేయర్లు రీసర్వే కోసం గ్రౌండ్ పాయింట్స్ లెక్కింపును వేగవంతం చేయాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్లు వెంకట రమణారెడ్డి, కృష్ణమూర్తి కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే పురోగతిపై సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మిట్టపల్లి, నెల్లిమంద రెవెన్యూ పరిధిలో రీ సర్వే పూర్తి అయ్యిందని, మిగిలిన మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వ ఆస్తులు భూములు గుర్తించి గ్రామ సరిహద్దులను సిద్ధం చేయాలని ఇందుకోసం గ్రౌండ్ పాయింట్ల లెక్క పూర్తి చేసి రీసర్వే షెడ్యూల్ ప్రకారం జరిగే విధంగా సర్వేయర్లు విధులు నిర్వర్తించాలని కోరారు. ఎస్‌పిఓఎల్‌ఆర్‌ఓ సిద్ధం చేసుకుని రీ సర్వేకు అవసరమైన ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేసి రీసర్వేకు సన్నద్ధం కావాలని కోరారు. తహశీల్దార్ మధుసూదన్, వీఆర్వోలు సర్వేయర్లు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు గురువులే..!

టిడిపి మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి- రామకుప్పం: జాతీయ ఉపాధ్యాయులు దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన అందించాలని సూచించారు.సమాజాన్ని తీర్చి దిద్దే గురుతర భాధ్యత గురువులదేనన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో లక్ష్మి కాంత్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, నరసింహులు, సీతాపతి, గుర్రప్ప, సుబ్రీ, బాలు, మల్లికార్జున, నారాయణ, పాల్దేవ్, రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం ఎంపీడీవోగా వనజ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల ఎంపీడీవోగా వనజ బుధవారం మండల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నారాయణవనం మండలం ఏవోగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎస్ఆర్ పురం మండలానికి ఎంపీడీవోగా వచ్చారు. ఆమె మాట్లాడుతూ అధికారుల ప్రోత్సాహంతో ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు ఉత్తమ సేవ అందిస్తానని తెలిపారు.

మునస్వామికి అభినందనలు...!

ప్రజాశక్తి - రామకుప్పం : రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా ఎన్నికైన రామకుప్పం మండలంకు చెందిన మాజీ జడ్పిటిసి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామిని బుధవారం పలువురు అభినందించారు. రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, కెంచనబల్ల మాజీ ఉపసర్పంచ్ సతీష్, ఆత్మ మాజీ డైరెక్టర్ రామలింగారెడ్డి తదితరులు మునస్వామికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. టిడిపిలో కష్ట పడే కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని వారు పేర్కొన్నారు.

భూగర్భ జలాలపై అవగాహన

ప్రజాశక్తి- యాదమరి: మండలంలో భూగర్భ జలాలు పెంచేందుకు జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాల మేరకు భూగర్భ జలాల పెంపుదలపై బుధవారం 155 కమ్మపల్లె గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల ఏపీఓ సంధ్యారాణి చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 158 ప్రాంతాల్లో భూగర్భ జలాలు 20మీటర్ల కన్నా తక్కువగా ఉందన్నారు.అందులో భాగంగా మండలంలోని 155 కమ్మపల్లి, దిగువ కనతల చెరువు గ్రామాలు ఉన్నాయన్నారు. భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేయడంతో పాటూ స్థానికంగా జీవనోపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

ద్విచక్ర వాహన వేలం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వివిధ కేసుల్లో నమోదైన ద్విచక్ర వాహనాల వేలంపాట సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వివిధ కేసుల్లో నమోదైన ద్విచక్ర వాహనాలను వేలం మొదలుగా అందులో 13 వాహనాలకు గాను 12 వాహనాలకు రూ.1,51,000లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని ఈ నగదును ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో దాతల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్నాక్స్, మీల్స్ ఏర్పాటు చేయడం గొప్ప ఆలోచన అని డీ.ఎం.పురం ప్రధానోపాధ్యాయులు నాథమునిరెడ్డి తెలిపారు. పీఎం పోషన్ అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం శుభ్ దిన్ తిథి భోజనం వంటి ఆలోచన ప్రవేశపెట్టిందని పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు అన్నారు. బుధవారం పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు సతీమణి స్వాతి పుట్టిన రోజు సందర్భంగా 125 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు వడ, అరటి పండు, పాపడ్స్ అందించారు. అలాగే రూ.3500లు విలుగల స్టేజ్ స్క్రీన్ను పాఠశాలకు వితరణగా అందించారు. ఈ సందర్భంగా దాతకు వారు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు సరస్వతి, మాలతి, కలై వాణి, వ్యాయామ సంచాలకులు కిషోర్ కుమార్, బొజ్జా రాము, డిల్లీ బాబు, రాములు, కార్తవరాయ, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు ఆరోగ్యం

చిత్తూరు అసిస్టెంట్ డైరెక్టర్ రూప సుందరి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులలో ఆరోగ్యం పెంపొంది పాల దిగుబడి పెరుగుతుందని తద్వారా పాడి రైతు లాభాల గడిస్తారని చిత్తూరు అసిస్టెంట్ డైరెక్టర్ రూప సుందరి అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం తుంగమిట్ట, ఎగువ మెదవాడ, కొత్తపల్లి బీసీ కాలనీ గ్రామాల్లో153 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ టీకాలు వేస్తే పశువులలో పాల దిగుబడి తగ్గుతుందని వదంతులు నమ్మవద్దని రైతులకు సూచించారు. అలాగే దూడలకు కూడా టీకాలు వేసుకోవాలని దూడల్లో మరణశాతాన్ని తగ్గించవచ్చని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తయ్యూరు పశువైద్యాధికారి శ్రీవిద్య, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు

వైద్య నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం పట్టణం ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలోని విద్యాశాఖ సమగ్ర శిక్షణ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వైద్య నిర్ధారణ శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం నాలుగు మండలాల ప్రత్యేక అవసరాల గల పిల్లలు దాదాపుగా 220 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ప్రారంభించారు.

పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి- పలమనేరు: ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు పలమనేరు వెలుగు ఆఫీస్‌లో ప్రారంభించడం జరిగింది. మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ గర్భవతి, బాలింతలు, పిల్లల సంరక్షణ, పౌష్టిక ఆహారం, పరిసరాల పరిశుభ్రతల గురించి అవగాహన, ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మహోత్సవాల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపండిఓ వినోద, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ఉమారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పోషణ విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్వైజర్ కవిత అన్నారు. బుధవారం మండలంలోని కల్లూరుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా కార్యక్రమం అంగన్వాడీ గీత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ కవిత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో రోజువారి క్యాలెండర్ ప్రకారం పోషణ విలువల కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని తెలిపారు. తల్లీకి బిడ్డకు ముర్రిపాలతోనే ప్రేమ అనుబంధం ఏర్పడతాయని, గర్భవతులు, బాలింతలు తీసుకునే ఆహారాన్ని బట్టి తల్లిపాలలో పోషకాలు పెరుగుతాయని బిడ్డకు తల్లిపాలును పట్టడంతో సమస్యలు ఉన్నట్లయితే సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన ప్రసవానంతరం రక్తస్రావం తగ్గుతుందని గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఆహారంలోనే పోషణ విలువలు కలిగిన ఆహారం లభ్యమవుతుందని దాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.

వెదురుకుప్పం: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మా కార్యక్రమం బుధవారం మండలంలోని మాంబేడు అంగన్వాడీ మెయిన్ సెంటర్‌లో సూపర్వైజర్ శకుంతల అధ్యక్షతన నిర్వహించారు. ఐసిడిఎస్ కార్వేటినగరం ప్రాజెక్టు అధికారి శోభారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ కృష్ణ చైతన్య పాల్గొని మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు 18నుంచి 45 సంవత్సరాల మహిళలకు పోషణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీనరసింహ, ఆరోగ్య సూపర్వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర ప్రజలు, యువత, నాయకులు అంతా కలిసి చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ -2025 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చిత్తూరులో స్వచ్ఛతోత్సవ్ ర్యాలీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, యువత భాగస్వాములై ఎక్కడా చెత్త లేకుండా చూడాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ గ్రామాలు, పట్టణాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు వారు ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డు స్థాయిలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛతా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ చిత్తూరు సాధ్యమవుతుందన్నారు. చెత్తలేని నగరంగా చిత్తూరును తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలన్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, కార్పొరేటర్లు ఇందు, శశి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 16వ తేదీ నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మండలస్థాయి ఆటల పోటీలలో నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు పోటీలలో ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ తెలిపారు. 100, 200 మీటర్ల పరుగు పందెంలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని దీక్షిత ప్రథమ స్థానంలో నిలిచారని, డిస్క్ త్రో షాట్ పుట్ పోటీలలో పదవ తరగతి చదువుతున్న నికిత ప్రథమ స్థానంలో నిలిచిందని, 9వ తరగతి చదువుతున్న టీ జస్వంత్ డిస్క్ త్రో లో ద్వితీయ స్థానం, 9వ తరగతి చదువుతున్న పి.రేవంత్ షార్ట్ పుట్‌లో తృతీయ స్థానాన్ని, పదవ తరగతి చదువుతున్న రేవంత్ 25 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని, చదరంగం, యోగాలో పదవ తరగతి చదువుతున్న లక్ష్మీ ప్రథమ స్థానాన్ని, తొమ్మిదవ తరగతి కే.రెడ్డి ప్రియా యోగాలో ద్వితీయ స్థానాన్ని, తొమ్మిదవ తరగతి రెడ్డి భవాని యోగలో తృతీయ స్థానాన్ని, పదవ తరగతి ఏ.ధోర్నా, టి.జస్వంత్, మోహన్, విద్యార్థులు బేస్బాల్ వాలీబాల్ కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం తపోవనం పాఠశాలలో ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించారు. పిల్లలతో కలిసి పోస్ట్ కార్డు ద్వారా ప్రధానమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఆర్ పురం: బిజెపి నేషనల్ కౌన్సిల్ నెంబర్, నియోజకవర్గ ఇన్చార్జి రాజేంద్ర ఆధ్వర్యంలో ప్రధాని మోడీ పుట్టినరోజు పురస్కరించుకొని మండల ఆరోగ్య కేంద్రం నందు రోగులకు బ్రెడ్లు, పండ్లు , పళ్ళ రసాలు బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు జిల్లా జ్యోతిరెడ్డి అందించారు.

పలమనేరు: పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు బిజెపి పట్టణ అధ్యక్షులు వంశీ, పట్టణ ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ గౌడ్, శక్తి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బైరెడ్డిపల్లి: మండల బీజేపీ అధ్యక్షుడు డి. వెంకటరమణ, ఉపాధ్యక్షుడు దుర్గప్ప గౌడు ఆధ్వర్యంలో ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

గంగాధరనెల్లూరు: అధికార పార్టీకి చెందిన కూటమి నేతలు మణి వర్మ, ఆనందబాబు వారి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. 300 మందికి అన్నదానం చేశారు.

విజయపురం (నగరి): ప్రధాని జన్మదినం సందర్భంగా పట్టణ పరిధిలో కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించి 60 యూనిట్ల రక్తదానం చేశారు. ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు బ్రెడ్లు, పండ్లను పంచిపెట్టారు, అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర ప్రసాద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు నగరి విద్యార్థి



ప్రజాశక్తి- విజయపురం (నగరి): జాతీయ స్థాయి జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీలకు నగరి పట్టణ పరిధిలోని సాయి వికేకానంద కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కేసీ తేజేస్ ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 10వ అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా నుంచి పాల్గొన్న తేజేష్ ప్రతిభ కనభరచి జాతీయ జట్టుకు ఎంపికవ్వడంతో పాటు స్టార్ ఆఫ్ ఆంధ్ర ధృవీకరణ పత్రంను పొందాడు. ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తేజేష్‌ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు అభినందించారు. జాతీయ స్థాయిలోను ప్రతిభ కనభరచాలని ఆకాంక్షించారు.

హోరాహోరీగా మండల స్థాయి పోటీలు



ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల సమీపం గల కేవీకే మైదానంలో విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం ఈ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులు అత్యంత ఆసక్తి కనభరిచారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడా కమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్‌ల నేతృత్వంలో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, కేవీకే నిర్వాహకులు బాబు, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆటల పోటీలలో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడల పోటీలను బుధవారం ఎంఈఓ 2, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు ప్రధానోపాధ్యాయులు ఎస్.మనోరంజని, డి.దేశమ్మ ప్రారంభించారు. మండలంలోని 17 పాఠశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14 వాలీబాల్ పోటీలలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడపనత్తం ద్వితీయ స్థానం, బాడ్మింటన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం, ఖో ఖోలో తీర్థం మొదటి స్థానం, నెల్లిపట్ల ద్వితీయ స్థానం సాధించారు. అలాగే అండర్ -17 వాలీ బాల్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా బాలురు మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో గురుకుల పాఠశాల కమ్మనపల్లి మొదటి స్థానం, కడపనత్తం ద్వితీయ స్థానం, ఖో ఖోలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు మొదటి స్థానం, ఆగస్తి పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. రేపు 18వ తేదీన కబడ్డీ, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పీడీలు చిరంజీవి, సుజాత, షాహినా, శాంతి, మోహన్, ప్రవీణ, తరుమ్ తాజ్ తెలిపారు.

మండల స్థాయి క్రీడాపోటీలు



ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రొంపిచర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ ఆర్.ఇబ్రహీం ఖాన్ ప్రారంభించారు. ఈ ఆటల పోటీల్లో మండలంలోని అండర్- 14, 17 వయసు గల విద్యార్థులు అన్ని ఉన్నత పాఠశాలల నుంచి పాల్గొన్నారు. ఆటల పోటీలలో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, షాట్ పుట్, చెస్, బ్యాడ్మింటన్ మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని జోనల్ స్థాయిలో జరిగే పోటీలకు పంపించడం జరుగుతుందని ఎంఈఓ డి శ్రీనివాసులు తెలిపారు.

బైరెడ్డిపల్లి ఎంపీడీవోగా చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల ఎంపీడీవోగా చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా విరమనాయనిపల్లి మండలం ఏఓగా పనిచేస్తున్న చంద్ర శేఖర్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై బైరెడ్డిపల్లి ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ డిప్యూటీ ఎంపీటీవోగా పలమనేరుకి బదిలీపై వెళ్లారు.